మూడో యూనిట్

# 14. గుశ్వం

ఉపవాచకం



జానపద గాథలలో "పరమానందయ్యగారి శిష్యుల కథలు" ఎంతో వినోదాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఆయన శిష్యుల చర్యలు, చేష్టలు నవ్వు పుట్టిస్తూ ఉంటాయి. పరమానందయ్య శిష్యుల కథలని చెప్పుకొనే వాటిలో ఒక కథ ఈ నాటికకు ఆధారం.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## పాత్రలు

పరమానందయ్యగారు, చెన్నడు, గున్నడు, తిన్నడు, పెద్దమనిషి.

### మొదటి రంగం

(పరమానందయ్యగారి ఆశ్రమం : చెట్టుక్రింద తిన్నెమీద కూర్చుని పరమానందయ్యగారు శిష్యులకు పాఠం చెపుతూ ఉంటారు. శిష్యులు కింద చాపమీద భక్తి శ్రద్ధలు చూపుతూ ఆయనకు ఎదురుగా కూర్చుని ఉంటారు.)

పరమా: చెప్పు, చెన్నడూ! చెప్పు! గుఙ్లము .... చెప్పు!

చెన్నడు: గుల్లము - గుల్లము.

పరమా: గుల్ల మేమిట్రా? గుఙ్లము అను.

చెన్నడు: గుల్లము.

పరమా: కాదురా, 'ఙ', బండిరా.

చెన్నడు: బండిరా అండీ? అలా చెప్పరేం? మరండీ, అందుచేతనేనండి నాకా మాట రావటం లేదు.

పరమా: ఎలా చెప్పమంటావురా?

చెన్నడు: ఇప్పుడు చెప్పారుగాదండి బండిరా అని. అదే ...

పరమా: ఏమదేరా?

చెన్నడు: గుల్లంలో బండిరా ఉందన్నారుగా? గుల్లము, బండి కూడా ఒక్కసారి నాకు నోట పట్టటం లేదండి.

గున్నడు: ఔనండి గురువుగారూ! వాడి నోరు బొత్తిగా చిన్నదండి. బళ్ళు, రాళ్ళు అసలు పట్టవు... మరో మాట చెప్పండి.

పరమా: మొదట్లోనే అలా చెప్పమని ఏడవకపోయావూ? సరే గున్నడూ? నువ్వు చెప్పు అశ్వం.

గున్నడు: అంటే ఏమిటండీ.

పరమా: అశ్వం రా ... అశ్వం ... అంటే గుర్రమన్న మాట.

చెన్నడు: అశ్వం గుర్రం ఎలా అవుతుందండి? గురువుగారూ! ... నాకు తెలియక అడుగుతానుకానీ ... బొత్తిగానూ!

పరమా: అశ్వము గుర్రం అవడం కాదురా ... రెండు మాటలకూ ఒకటే అర్థం. అశ్వం అనే మాట సంస్కృతమూ, గుర్రమనే మాట తెనుగూనూ!

గున్నడు: అలాగండీ! ఈ రెండు మాటలూ వచ్చేస్తే తెలుగూ, సంస్కృతమూ రెండు భాషలూ వచ్చేస్తాయన్నమాట.

© SCERT not to be republished

చెన్నడు: అయితే గురువుగారూ! రెండు మాటలు రెండు ఘడియల్లో కంఠతాపట్టేసి వప్పచెప్తామండీ. అలా చెట్టు కింద కూర్చుని వల్లెవేసుకొస్తాం.

వరమా: సరే పొండి. శ్రద్ధగా వల్లెవేసి చెప్పండి. నేను ఈలోగా పూజ పూర్తిచేసుకొని వస్తాను (వెడతాడు).

చెన్నడు: ఒరే గున్నా. అబ్బా! ఎంత అదృష్టవంతులంరా మనం! రెండూ ... రెండు భాషలు వచ్చేస్తున్నాయి మనకి.

గున్నడు: ఏమిట్రోయ్, రెండూ నీకే అన్నట్టుగా మాట్లాడుతున్నావ్! ఒకటి నాదీ.

చెన్నడు: నీదెలా అవుతుంది. ఒకటి నాది, రెండు నీదీని......

గున్నడు : ఒరేయ్ గుర్రం అని నువ్వనలేకపోతే నేను గురువుగారిని ఇంకో మాట చెప్పమని అడిగానా? అప్పుడు ఆయన ఏమని చెప్పార్రా....?

చెన్నడు : అవును చెప్పారు.... నాకోసం చెప్పారు కనుక అశ్వం నాదీ, గుర్రం నీదీను.

గున్నడు : నే నొప్పుకోను, నాది అశ్వం.

చెన్నడు : కాదు, గుర్రం నీది.

(గబగబ అంటూ ఇద్దరూ పోటీపడతారు)

చెన్నడు : ఒరేయ్ ! నువ్వలా పేచీ పెట్టావంటే గురువుగారితో చెబుతాను.

గున్నడు : గురువుగారితో చెబితే ఇద్దర్నీ తిడతారు. ఒరేయ్ చెన్నా నీకు తెలియదు కాబోలు!

చెన్నడు : అవునురోయ్–నిజమే ఆ మాట ! పిచ్చి మొద్దుల్లారా ! ప్రతిదానికీ అలా దెబ్బలాడుకొంటారుట్రా? ఏదో కూడబలుక్కుని, సమాధానపడి, కలిసికట్టుగా పనిచేసుకోవాలిగానీ, అంటారు. అప్పుడేం చేస్తాం?

గున్నడు: అందుకోసం సమాధానపడదాంరా, చెన్నా! ఏం?

చెన్నడు: సమాధానపడడం ఎలాగురా? గున్నా!


గున్నడు: ఎలాగంటే నేను చెబుతానుగా! జాగ్రత్తగా వినరా చెన్నా! ఏమంటే మొట్టమొదట గురువుగారు చెప్పినది... గుల్లమనేగా?

చెన్నడు: అవును, అందులో బండిరా ఉందిగా, అది నాకు రాలేదుగా–


గున్నడు: రాకపోతేనేం? నాకు చెప్పిన అశ్వం ఉందిగా! నీ మాటలో బండిరా ఉన్నచోట నా మాటలోని –శ్వ– పెట్టేస్తే సరి!

చెన్నడు: ఏమిటేమిటి? ఇట్టే చెప్పేశావురా! నాకు అట్టే అర్థమవలేదురా! విడమరచి చెప్పరా! అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లూ........

గున్నడు: ఏమంటే, అర్థంచేసుకొంటూ విను–వింటూ అర్థంచేసుకో – తెలిసిందా? ఏమంటే ! గుర్రములోని 'ఱ' తీసేసి, అశ్వంలోని 'శ్వ' ను 'ఱ'ఉన్నచోట పెట్టేయడమే రా!



©SCERT not to be republished



చెన్నడు : బలే ఆలోచనరా! అప్పుడెలా అనాలి? గుల్లము అశ్వము బదులు శ్వ శ్వ ఆ! అరె! గుశ్వము–ఒరేయ్ గున్నా, వచ్చేసిందిరా గుశ్వము. గుశ్వమురా గున్నా! గుశ్వం..... గుశ్వం (అంటూ ఆనందంతో ఎగురుతూ గంతు లేస్తాడు)

గున్నడు: (చెన్నడితోపాటు సంతోషంతో తిరుగుతూ చెన్నడిని నిలబెట్టి) అదీ! చూడు, ఇప్పుడు నీకు నోరూ పడుతుంది, మన రెండు మాటలూ కలిసి ఒక సమాధానమూ కుదిరింది. బావుందిరా! చాలా బాగుంది. కాదురా ! చెన్నా పద...... మన గురువుగారికి దీన్ని – ఏది ఈ గుశ్వాన్ని– వప్ప జెప్పేస్తే పాఠం వప్పచెప్పినందుకు మనల్ని ఎంతో మెచ్చుకుంటా(్రా పద.....పద.....

చెన్నడు: పద, పదరా బాబూ– నాకు ఆనందం ఆగటం లేదు. అంతా ఉక్కిరి బిక్కిరి అయిపోతూంది. అరుగో గురువుగారు!

ఇద్దరు: గురువుగారూ ! గురువుగారూ! వచ్చేసిందండి, ఇద్దరికీ కంఠతా వచ్చేసింది, గుశ్వమూ......

పరమా: ఏమి వచ్చేసిందిరా?

ఇద్దరూ: గుశ్వమండి! గుశ్వం

పరమా: గుశ్వమేమిటిరా? గుశ్వం రావడమేమిట్రా? గుశ్వమూ

చెన్నడు: గుశ్వమేనండి గుశ్వం..... గుశ్వం

పరమా: ఇదెక్కడొచ్చిందిరా ? ఎప్పుడూ వినలేదూ......!

చెన్నడు: అలా అడగండి చెబుతాను గురువుగారు? నాకు గుల్లం చెప్పారా! అందులో నాకు బండిరా రాలేదుగా.

గున్నడు : నాకు అశ్వము చెప్పారా? అది నాకు వచ్చేసిందా?.......

చెన్నడు : వాడికి వొచ్చినదీ, నాకు రానిదీ రెంటినీ కలిపి, ఇద్దరికీ వొచ్చేట్టు చేసేశాం, గురువుగారూ! కలిసికట్టుగా ఉండాలని రెండూ కలిపేశాం. అప్పుడు గుశ్వము అయిందండీ. ఓ మాటలో గుశ్వం అయి ఊరుకుంది గురువుగారూ!

గున్నడు: రెండు భాషలూ కలిపేసి నేర్చేసుకుంటున్నాం గురువుగారూ!

పరమా: ఏడిచినట్టే ఉంది మీ నేర్చుకోవడం మీరూను....!శివ శివ శివ శివ శివా!

చెన్నడు : గురువుగారూ అదేమిటండీ! గురువుగారూ! అలా అనేశారేమిటండీ! గురువుగారూ! తప్పయితే మీరు మమ్మల్ని క్షమించాలి! గురువుగారూ! క్షమించేసెయ్యాలి!

పరమా: శివ శివా ! ఏం క్షమించమంటా(్రా ? మీ తెలివి అంతా విషమించిపోతూ ఉంటేనూ.....!

ఇద్దరూ: విషమించడమా? అంటే ! విషమే .... అయ్యబాబోయ్...... విషమేనాండీ?

పరమా: మీ మొహం.... చెప్పిన ఒక మాటైనా నోట పట్టని శుంఠలు .....ఎలా చచ్చేదిరా మీతోటి!

© SCERT not to be republished

ఇద్దరూ: చచ్చిపోవద్దు, గురువుగారూ! మీరు చచ్చిపోతే మేము బతికి ఉండేటంత తెలితక్కువవాళ్ళమా గురువుగారూ! (బతిమలాడుతూ) గురువుగారూ ! నోరు తిరిగే ఇంకో మాట చెప్పి పుణ్యం కట్టుకోండి!

గున్నడు: గురువుగారూ ! క్షమించి ఇంకో మాట చెప్పండి!

పరమా: సరే చెబుతాను ఏడవకండి. తురగము.

చెన్నడు: మేం తిరగమండీ!

గున్నడు: ఎక్కడా తిరగము గురువుగారూ! ఇక్కడ ఉండే వల్లెవేస్తాం. చెప్పండయ్యా.

పరమా: తిరగడం కాదురా.......తురగము అనండి, గుర్రం రాకపోతే.

చెన్నడు: గుర్రం రాకపోతే తిరగడమెలా తిరుగుతాము గురువుగారూ?

గున్నడు: అది గాదురా! గుర్రం వచ్చినా తిరగమని చెప్పరా. తిరగమండయ్యా. గురువుగారూ గుర్రం వచ్చినా తిరగం. చచ్చినా తిరగం. మీరు చచ్చిపోయినంత ఒట్టే! తిరగం తిరగం!

పరమా: హరీ హరీ! నేను చావనూ వద్దూ, మీరు తిరగనూ వద్దు పోండి, అవతలకు పోండి!

చెన్నడు: అది గాదండీ............

పరమా: కాకపోతే, ఏమిట్రా నీ మొహం ! శివ శివ ...... మీకు గుర్రమూ రాదు, అశ్వమూ రాదు, తురగమూ రాదు. శివ శివ – మీకే రానిది నాకేం చేసి పెడతారురా! గుర్రం మాట నేర్పితే, గుర్రాన్ని సంపాదించుకు వచ్చి, దానిమీద నన్ను కూర్చోబెట్టి కాశీకి తీసుకు వెడతారనుకున్నానా! శివ శివ శివ వాడేడిరా మూడోవాడు.....? తిన్నడూ?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! వచ్చేశానండీ .....పట్టేశానండి. పట్టేసి, వచ్చేశానండీ గురువుగారూ.....!

(వగర్చుకొంటూ, ఆపసోపాలు పడతాడు)

పరమా: ఏం పట్టేశావురా? అంత ఆయాసమెందుకురా? కూర్చోరా.......ఆయాసం తీర్చుకోరా, ముందు స్తిమితపడరా, అప్పుడు చెప్పు!

తిన్నడు: పట్టేశానండీ......గుర్రం, గుర్రం గుడ్డూ కూడా పట్టేశానండీ.

పరమా: గుర్రమా? గుర్రంగుడ్డా? ఏం పట్టేశావురా?


తిన్నడు: రెండూ పట్టేశానండి, రెండండీ, రెండూ పట్టేశానండి, గురువుగారూ!

పరమా: ఏమిట్రా ? స్తిమితపడి చెప్పరా.... ఏం పట్టేశావూ? ఎక్కడ పట్టేశావూ?

(తిన్నడు ఆయాసపడుతూ చెబుతూ ఉంటే చెన్నడు వాడికి విసనకర్రలతో విసురుతూ తాను కూడా ఆయాసపడుతూ ఉంటాడు)



©SCERT not to be republished



తిన్నడు: చెప్తానండి. మీకు గుఱ్ఱము ఎక్కాలనే కోరిక ఉన్నదని తెలుసుకొన్నటువంటివాడనై అద్దానిని ఎక్కడ ఉన్నా అంగ, వంగ, కళింగ, కాశ్మీర, నేపాళ, ఘూర్జర .... ఛప్పన్న దేశాలలో ఎక్కడ ఉన్నా పట్టుకొని వచ్చి, మీ పాదాలకడ ఉంచాలని బయలుదేరానండి ....కాని అదృష్టవశాత్తూ దగ్గరలోనే అది దొరికిందండి.

పరమా: అలాగట్రా, తిన్నడూ! ఎక్కడ దొరికిందిరా? నా నాయన! నా నాయన! చెప్పు చెప్పు ......

తిన్నడు: మన మఠానికి పది కోసుల్లో ఓ చెరువు గట్టున రెండు ఆడగుఱ్ఱాలు మేస్తున్నాయండి. బలేగా ఉందని అనుకొని ఆ గుఱ్ఱాల ఆసామిని అడిగానండి 'గుడ్లు అమ్ముతావా?' అని అతడు నాకేసి అట్టే పైకి కిందికి చూసి అమ్ముతానన్నాడండి. అయితే, 'ఎంత వెల?' చెప్పమన్నానండి. పది వరహాలిచ్చి పట్టుకు వెళ్ళమన్నాడండి. ఆపళంగా పరుగెత్తుకొంటూ వచ్చేశానండి. పది వరహా లిచ్చేయండి గురువుగారూ... పట్టుకొచ్చేస్తాను గురువుగారూ ! గుఱ్ఱంగుడ్డు పట్టుకొచ్చేస్తానండి.

పరమా: ఆс ఆс ఎంత పని చేసుకొచ్చావురా నాయనా......శిష్యుడంటే నువ్వేరా!

తిన్నడు : చిత్తమండి గురువుగారూ!...... మీ ఆశీర్వచన ఫలితమండి గురువుగారూ.

పరమా: వత్సా! ఆ గ్రుడ్లు శ్రేష్ఠమైనవేనా.....? ప్రశస్తమైనవేనా!

తిన్నడు: అయ్యో గురువుగారూ! రెండూనండి! రెండూ రెండేనండీ! పదివరహాలిచ్చేయండి.....పట్టుకొచ్చేస్తా! పరుగెత్తుకుని వెళ్ళి, పట్టుకొని పరుగెత్తుకొని వచ్చేస్తా.

పరమా: ఔనురా–ఔను–అది అవశ్యం ఆచరణీయమే కాని, కాస్త ఆలోచనీయం కూడాను – (ఆకాశం వైపు చూస్తూ ఆలోచిస్తాడు)

చెన్నడు: ఆలోచించకండి గురువుగారూ!.... ఇచ్చేయండి పట్టుకొస్తాం .....ఆలోచన అనవసరమండీ! ఇలాగ ఆలోచిస్తూ కూర్చుంటే అవకాశం జారిపోతుందండీ.....

గున్నడు: మాకు గుఱ్ఱము అనేమాట రాకపోయినా మీకు గుఱ్ఱమైనా వస్తుంది.... మమ్మల్ని పంపించండి..... మోసుకొచ్చేస్తాం ఆలోచించకండి. ఆలోచిస్తూ కూర్చుంటే, ఆలస్యం అయిపోతుంది.

చెన్నడు: 'ఆలస్యం అమృతం విషం' అన్నారుగా మీరు. గురువుగారూ! జ్ఞాపకం చేసుకోండి.

పరమా: అయితే, తలిచినప్పుడేనా తాత పెళ్ళి?

తిన్నడు: తాత పెళ్ళాండి? గురువుగారూ ! బలే! బలే.....! గుఱ్ఱాన్ని తీసుకొచ్చేస్తే దానిమీద ఎక్కి సవారి చేస్తూ అందరమూ తాత పెళ్ళికి తరలి వెళ్ళొచ్చు కదండీ!

చెన్నడు: ఔనౌను ......చల్ చల్ చల్ చల్ ......(అంటూ అందరూ గుఱ్ఱం ఎక్కినట్లు తిరుగుతారు)

గున్నడు: గురువుగారూ!.....ఆలోచించకండి........

పరమా: ఆలోచించకుండా ఎలాగురా? గుఱ్ఱంగుడ్డు గాని, గుఱ్ఱం కాదుగా!

© SCERT not to be republished

చెన్నడు: అయితే నేమండి గుర్రం గాక, గుర్రంగుడ్డు కావటం మంచిదండీ!

పరమా: దాన్ని పొదగవద్దూ ? ఎవరు పొదుగుతారు?

చెన్నడు: మేమంతా లేమూ గురువుగారూ! అంత చేతగానివాళ్ళమా గురువుగారూ?

గున్నడు: పొదగబెట్టడమే గాదు, ఎదగ బెడతాం కూడానూ......

తిన్నడు: ఇందులో ఇంకొక ధర్మసూక్ష్మం కూడా ఉంది. గమనించండి గరువుగారూ! గుడ్డు దగ్గర్నించీ పొదిగి ఎదిగిన గుఱ్ఱం మనం చెప్పినమాట వింటుంది. అదే ఎదిగిన గుర్రం అయితే మన మాట వినదు. ఎగిరి తన్నుతుంది. అది చాలా ప్రమాదకరం కనుక పది వరహాలు ఇచ్చేయ్యండయ్యా మోసుకొచ్చేస్తాం....గురువుగారూ......

పరమా: సరే! ఇంతగా సరదా పడుతున్నారు కనుక ఆ గుడ్డు పట్టుకురండి. అమ్మగారి నడిగి సొమ్ము పట్టుకెళ్ళండి. జాగ్రత్తగా వెళ్ళిరండి. గుడ్లు మొయ్య లేకపోతే, మీరు ముగ్గురూ వంతు లేసుకుని భుజాలు మార్చుకోండి. చెట్లంటా గుట్లంటా జాగ్రత్తగా వెళ్ళిరండి.

అందరూ: వెళ్ళి వస్తాం గురువుగారూ, నమస్కారం.!

పరమా: శుభం. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరండి.

## రెండవ రంగం

(పొలాల మధ్య గట్టుదారి. ఒక బూడిద గుమ్మడికాయను గుడ్డలో మూటకట్టి, దాన్ని ఒక కర్రకు వేలాడకట్టి ఇద్దరు శిష్యులు తమ భుజాలమీద ఆ కర్రను పెట్టుకొని మోసుకొస్తూ ఉంటారు. మూడో శిష్యుడు హుషారిస్తూ ఉంటాడు.)

అందరు: ఓం ఓం ఓం ఓం.

చెన్నడు: ఒరేయ్ గున్నడూ ! భుజం మార్చుకోరా.

గున్నడు: ఛేస్! భుజమంతా తెల్లగా బూడిదయ్యింది. ఇందాకా భుజంమీద మోసుకొస్తేనూ......

తిన్నడు: గుడ్డా? మరోటా? అయితే అయింది., జాగ్రత్తగా మోసుకురారా! మన మఠం దగ్గరకు వచ్చేస్తున్నాం!


గున్నడు: కర్రకు కట్టి మోసుకొస్తున్నాం కనుక కొంత సులువు అయింది.

తిన్నడు: ఔను. ఈ కొండ దాటామంటే మన ఆశ్రమం అల్లంత దూరంలో కనపడుతూ ఉంటుంది. ఆశ్రమం బయట గురువుగారు నుంచుని మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు.

చెన్నడు: ఒరేయ్ ! చెట్టుకొమ్మలు రా, వంగి నడవరా! లేకపోతే కొమ్మలు రాసుకొని గుడ్లు గీతగా పడిపోతుంది.

గున్నడు: ఆ, కొమ్మ కిందికి వచ్చేశాక చెబుతారేం రా (ధ్వని) అరే అనుకున్నంత పనీ అయింది. కర్ర జారిపోయి గుడ్డు కింద పడిపోయిందిరోయ్!


తిన్నడు: అయ్యో, గుడ్డు పగిలిపోయిందిరోయ్!



©SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



చెన్నడు: పోతే పోయిందిగాని- ఒరేయ్ పిల్ల ఊడిపడిందిరోయ్. బలే, బలే.........

(మూట కిందపడి కాయ పగులుతుంది. అదే సమయంలో ఆ పొదలచాటు నుండి ఒక తెల్లటి కుందేలు బెదురుతూ పారిపోతుంది.)

గున్నడు: ఆ డొంకలోకి పిల్ల పారిపోయిందిరోయ్.

తిన్నడు: అరెరె! ఎలాగ? గుడ్డూ పోయి, పిల్లా పోయి......

చెన్నడు: వెదుకుదాం పదండి. అదిగో అది పారిపోతోంది.

గున్నడు: అరే! తెల్లగా బొద్దుగా చెవులూ అదీ.......మా బలేగా ఉంది. అరెరే.....మా అందమైన గుఱ్ఱం గుడ్డు పిల్లరా! ఇట్టే జారిపోయిందిరా! చూస్తూ కూడా దాన్ని పట్టుకోలేకపోయామేమిటి? చెన్నా?

చెన్నడు: ఏం చెప్పమంటావురా? చేతుల్లో దొరికి వేళ్ళమధ్యనుండి జారిపోయిందిరా, అయ్యయ్యో (ఏడుస్తాడు)

తిన్నడు: ఏడువకురా చెన్నా! నువ్వు ఏడిస్తే గున్నడు కూడా ఏడుస్తాడురా.........అప్పుడు నాకు కూడా ఏడుపొచ్చేస్తుందిరా!

గున్నడు: ఏడుపు వస్తున్నపుడు, ఏడవ వద్దంటే, ఎలా ఏడవడంరా? ఒరేయ్-ఏడుస్తూ కూర్చోవడం కాదురా-ఏడుస్తూనే గుఱ్ఱం గుడ్డు పిల్లకోసం వెదుకుదాం, పదండిరా! ఈ తుప్పలూ గిప్పలూ ముళ్ళూ గీసుకుపోయినా సరే-వెదుకుదాం పదండిరా!

చెన్నడు: అలాగే పదండిరా! ఏడుస్తూనే వెదుకుదాం ఏంచేస్తాం? పదండి!

గున్నడు: గుఱ్ఱంగుడ్డూ లేక, గుఱ్ఱంగుడ్డుపిల్లా లేక గురువుగారి మొహం ఎలా చూస్తాంరా?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! ఎంత పని జరిగిపోయిందండీ? (ఏడుస్తాడు)

చెన్నడు: (ఏడుస్తూ) ఏడవకురా! వెదకరా!

గున్నడు: పదరా, నువ్వు ఆ పక్కకు పరుగెత్తు, నే నీపక్కకు పరుగెడతాను. పొలాలన్నీ వెతికేద్దాం.

(విచారంగా ముగ్గురూ అక్కడంతా వెదుకుతూ, మూడు వైపులకూ వెడతారు.)

## మూడవ రంగం

(ఆశ్రమంలో పరమానందయ్యగారు శిష్యులకోసం ఎదురు చూస్తూ ఉంటారు. అంతలో శిష్యులు ముగ్గురూ వచ్చి ఆయన పాదాల మీద పడతారు.)

చెన్నడు: మీ పాదాలకు దండాలు గురువుగారూ!

గున్నడు: సాష్టాంగ దండ ప్రణామాలు గురువుగారూ.

తిన్నడు: అనేకకోటి దండాలు గురువుగారూ!

పరమా: అయ్యో! అయ్యో! అదేమిటర్రా-చెన్నా, గున్నా, తిన్నా లేవండిరా- లేచి నిలబడండిరా- ఏంచేశారు?

© SCERT not to be republished

చెన్నడు: చావలేక బతికి వచ్చాం గురువుగారూ!

గున్నడు: బతకలేక చచ్చి వచ్చాం గురువుగారూ!

తిన్నడు: చావూ కాక బతుకూ కాక, ఇక్కడకు వచ్చిపడ్డాం గురువుగారూ!

పరమా: ఏమిట్రా -ఏం జరిగింది? ఒంటినిండా ఈ రక్కు లేమిటి? ఈ రక్తా లేమిటి?

చెన్నడు: గుర్రంగుడ్డుపిల్లకోసం పరుగెత్తి పాటుపడ్డాం గురువుగారూ!

గున్నడు: చెట్లంటా గుట్లంటా పరుగులెత్తి పడి, దొర్లి ఇలా అయిపోయాము- గురువుగారూ!

తిన్నడు: పది ఆమడలూ పాటుపడ్డాం గురువుగారూ!

పరమా: ఇంతకీ ఆ గుఱ్ఱంగుడ్డుపిల్ల ఏదర్రా!

తిన్నడు: అది పారిపోయింది గురువుగారూ! దొరకలేదండీ.

చెన్నడు: గుడ్డు పగిలి పిల్ల గంతేసి పారిపోయిందండి.

గున్నడు: మా కళ్ళ ముందే తుర్రుమందండి.

పరమా: పోనీ ఆ పగిలిన ముక్కలేవర్రా?

చెన్నడు: ఇవిగో గురువుగారూ! ముక్కలన్నీ ఏరుకొచ్చామండీ-- కొంచెం కూడా వదిలెయ్యకుండా!

పరమా: ఆఁ......ఇదేమిటర్రా ఇదేమి గుఱ్ఱం గుడ్డర్రా! శివ శివా. ఇవి బూడిదగుమ్మడికాయ ముక్కలురా-- అయ్యయ్యో ఒకటి చెప్పి, మరొకటి చూపి, ఇంకొకటి పట్టుకొచ్చారేమర్రా! (తిన్నెమీద కూలబడతాడు)

చెన్నడు: బూడిద గుమ్మడికాయాండి? అంటే?

గున్నడు: గుమ్మడికాయ కానిది బూడిద గుమ్మడికాయ కాబోలురా....

తిన్నడు: బూడిద పూసుకొన్న గుమ్మడికాయను బూడిద గుమ్మడికాయ అంటారు కాబోలురా!

పరమా: మీ మొహం - శుంఠల్లారా! శివ శివ - గుర్రమూ లేదు, గుర్రంగుడ్డూ లేదు- పది వరహాలు గంగపాలుచేశారు కదర్రా.

పెద్దమనిషి: అయ్యా గురువుగారూ! నమస్కారాలండి!

పరమా: ఎవరు బాబూ ! మా శిష్యుడేనా ఏమిటి?


పెద్దమనిషి: మీ శిష్యుణ్ని కాకపోయినా అలాంటివాడినేనండి! అయితే మీ శిష్యులలాంటివాణ్ని మాత్రం కాదండి. మీరు జగద్గురువులు. అందుచేత అందరికీ మీరు గురువులే, అందరూ మీ శిష్యులే.....

పరమా: దాని కేం బాబూ! అదంతా మీ అభిమానం ! రా, ఇలా రా కూర్చో! అదేమిటి? ఏదో పట్టుకొచ్చావు?


పెద్దమనిషి: ఇదేనండి-గుర్రంగుడ్డుపిల్ల---

శిష్యులు: అరే, అరే, ఔనండి గురువుగారూ-అదే అదే! గుర్రంగుడ్డు పగిలి, పిల్ల పారిపోయింది.

పరమా: అది పారిపోయింది: మీ మతి జారిపోయింది-- వెర్రి చవటల్లారా! అది గుర్రంపిల్ల కాదు, కుందేలుపిల్ల.



© SCERT not to be republished



పెద్దమనిషి : చిత్తం – మీరైనా తెలుసుకొన్నారు. దీని కోసమే మీ శిష్యులు వెతికి వెతికి ఇలా అయిపోయారు.

పరమా: నేను మాత్రం వాళ్ళలా అయిపోకుండా ఉన్నానా? వాళ్ళతో పాటు నేనున్నూ మతిలేనివాడినై పోయాను.

పెద్దమనిషి: గుర్రంపిల్లను పెడుతుంది. గుడ్డు పెట్టదుగా--

పరమా: అదే, వాళ్ళతోపాటు నాకు కూడా మతిపోయిందని అంటున్నానుగా!

పెద్దమనిషి: అంత మాట అనకండి. మీరు పెద్దలు! వాళ్ళతోపాటు ఏదో పొరపాటు పడి ఉంటారు. అంతే! ఇవిగో మీ పది వరహాలూనూ!

పరమా: ఇదేమిటి. మీరే వీళ్ళకు అమ్మేరా?

పెద్దమనిషి : ఔను -- మా పొలంలో బూడిద గుమ్మడి కాయలను చూసి, గుర్రంగుడ్డు అమ్ముతావా? అని అడిగారు. వీళ్ళేమో చిత్రమైనవాళ్ళలా ఉన్నారని వీళ్ళకు అమ్మి, వీళ్ళతో పాటు వెనకాల బయలుదేరాను, విచిత్రం చూద్దామని! ఇక్కడ మిమ్ములను చూసి, ఇలా వచ్చాను, మీతో చెబుదామని!

పరమా: మంచివాడవు నాయనా! మాకందరికీ తెలివి చెప్పావు!

పెద్దమనిషి: తెలివి మాట ఎలా ఉన్నా -- మీ శిష్యులు సృష్టించిన "గుశ్వం" మాత్రం కలకాలమూ ఉంటుంది-- మీరు, మీ శిష్యులు -- చిరకాలము వర్ధిల్లుతారు తెనుగుజాతి జానపద చరిత్రలో – సెలవు !

పరమా: శుభం.!

రచన : **ఏడిద కామేశ్వరరావు;** మూలం : **పసిడితెర**, ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ.



## ఇవి చేయండి :



1. ఈ నాటకం వేయడానికి ఒకరు గురువుగాను, ముగ్గురు శిష్యులుగా, ఇంకొకరు పెద్దమనిషిగా ఉండాలి. నాటకంలోని సంభాషణలను అభ్యాసం చేయండి. పాత్రలకనుగుణంగా దుస్తులు ధరించాలి. అలంకరించుకోవాలి. తరగతిలో / పాఠశాలలో ప్రదర్శించాలి.
2. "గుశ్వం" నాటకాన్ని కథగా సొంతమాటల్లో పది వాక్యాల్లో రాయండి.
3. "గుశ్వం" నాటిక హాస్యంతో కూడినది కదా! ఎందుకో వివరంగా పది వాక్యాల్లో రాయండి.
4. "గుశ్వం" నాటికలోని శిష్యులు ఎలాంటివారు ? వీరి గురించి సొంతమాటల్లో రాయండి.
5. పరమానందయ్య గురువుగారు, తిన్నడు, చెన్నడు, గున్నడు శిష్యులు కదా! గురుశిష్యుల మధ్య ఉండే సంబంధం గురించి తెలపండి.

నేను మాట్లాడుతున్నప్పుడు నాదేశం మాట్లాడుతున్నదన్న భావం ధ్వనించేలా మాట్లాడాలి. – స్వామి రామ తీర్థ

© SCERT not to be republished